

# అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయక రాజాధిరాజు యోగిరాజు

## భౌతికదేహము విడిచినా 'సాయీ' అంటే చాలు 'ఓయీ' అంటూ అభీష్టాలు తీరుస్తాను - అన్న యోగిరాజు - సద్గురు సాయి మహారాజు!

**భూతసంఘం నాయకం విశాల కీర్తిదాయకం**
**నీతిమార్గకోవిదం పురాతనం జగత్ప్రభువుం**
**జ్ఞానముక్తిసాధకం శోకమోహలాభదైనకోపనాశనం**
**సాయినాధం ప్రభూ, సహస్రనామ వందితమ్**
**వందే విష్ణుం జగద్గురుమ్ షిర్డీవాస నివాసితమ్**
**అఖిలలోకపాలకం సాయరామ సద్గురుమ్ పాహిమాం**

శ్రీ సాయి, జయసాయి! జయ జయ సాయీ అని స్మరించండి చాల్ను మనం హాయి, మన జీవితం హాయి! మన కుటుంబంలోని వారు హాయి! మనకందరికీ అభయమిచ్చే యోగి మహరాజ్. సాయి 'నేనుండగ భయమేలా?' అంటూ ఆయన సమాధి నుంచే అభీష్టసిద్ధి చేసే మహారాజ యోగి.

1918 సంవత్సరం విజయదశమినాడు సమాధిలోకి వెళ్లేముందు భక్తులందరికీ ధైర్యం చెబుతూ భౌతిక దేహం వీడిననూ, 'సాయీ' అని నోరారా పిలిచిన నా భక్తుల రక్షణ కొఱకు పరుగు పరుగున వస్తానన్నారా సచ్చిదానంద సద్దురు సాయిమహరాజ్. నాయందు దృష్టి నిలిపిన వానికి నా కటాక్షం సంప్రాప్తిస్తుంది. షిర్డీ ప్రవేశమే సర్వదుఃఖపరిహారం. నా సమాధి నుండే సర్వకార్యములూ నిర్వహిస్తాను. నా భక్తుల యింట 'లేమి' యనునది ఉండదు అంటూ సాయినాధుడు ఏకాదశ (11) సూత్రాలను విశదపరచారు.

ఆయన యెప్పుడు పుట్టారో, యెక్కడ పుట్టారో జననీ జనకులెవరో ఎవరికీ తెలియదు. పదహారు సంవత్సరముల వయసులో ఆయన షిర్డీకి వచ్చారు. ఆయన పేరు కూడా ఎవరికీ తెలియదు. రెండవసారి షిర్డీ వచ్చినప్పుడు 'సాయీ' యని మహల్సాపతి పిలవడంతో, అందరూ ఆయన్ను సాయీ, బాబా అంటూ పిలవదొడగారు. ఆయన భక్తులందరూ శ్రీరాముని జన్మదినమునే సాయి జన్మదినముగా భావించి ఉత్సవాలు చేసేవారు. బాబా విచిత్రమైన వేషధారణ, విచిత్రమైన పలుకులు. ఆయన ఉపన్యాసాలు చేసేవారు కాదు. ఆయన పలుకులే వేదసూక్తులుగా ఉండేవి. బాబా షిర్డీ వచ్చారేగానీ, షిర్డీలో స్థిరనివాసం ఏర్పరచుకోవడానికి ఎన్నో





# పరబ్రహ్మ సచ్చిదానందసాయి 'మహారాజ్'



ప్రతిబంధకాలు ఎదురయ్యాయి. అప్పటిలో బాబా ఆకుపచ్చని అంగీనీ అదో తరహా గళ్ళలుంగినీ ధరించేవారు. దట్టంగా పెరిగిన జులపాల జుట్టుతో, నూనూగు మీసాలూ, గడ్డముతో అచ్చం ముస్లిము ఫకీర్‌లా ఉండేవారు. హిందూ దేవాలయంలో ఆయనకు ప్రవేశం దొరకలేదు. ఏ వేపచెట్టు నీడలో ఉండిపోతానన్నారు. మహల్సాపతి చాలా బాధపడ్డాడు. సాయిబాబా అలా నిరాశ్రయుడు కావడం షిర్డీ గ్రామానికే క్షేమం కాదనుకుని, షిర్డీలో ఉన్న ఓ పాడుపడిన మసీదులో స్థావరం ఏర్పరచుకోమని బాబాను బ్రతిమలాడాడు. భక్తజన సులభుడైన బాబా అందుకు అంగీకరించడం, మహల్సాపతికీ, షిర్డీ భక్తులకు ఎంతో ఆనందం కల్గించింది.

సాయి ఎప్పుడూ 'అల్లామాలిక్' – 'హరి ఓం తత్సత్' అంటూండేవారు. హిందూ ముస్లింలిరువురికీ బాధగానే ఉండేది. అల్లానూ హరినీ కలుపడం వారికి యిష్టం లేదు. అప్పుడు పొడసూపుతున్న హిందూ ముస్లిముల కలహాలను బాపాలన్నదే బాబా అంతరాంతర్యం. బాబా ఉంటున్న మసీదులోకి హిందువులు రారాదని ముస్లిములు ఆంక్ష విధించారు. కొందరు హిందూ భక్తులు భయపడేవారుగాని, బాబా అంకిత భక్తుడైన మహల్సాపతి భయపడక లోపలికి ప్రవేశిస్తూండేవాడు. అడ్డు వచ్చినవారిని తొలగించుకుని వెడుతూ, తన దైవమైన సాయిని దర్శించుకోవడానికి ఎవరు అడ్డు వచ్చిననూ, ధైర్యంబూని పూజాద్రవ్యములతో ముందుకు సాగుతుండేవాడు ముస్లిములు ఘట్టిగా మందలించారు, అడ్డగించారు – దారుణంగా కొట్టసాగారు. దెబ్బదెబ్బకూ 'శరణు సాయి, శరణు శరణు సాయీ' అంటున్నారే – తప్ప ముందుకు దూసుకుని వెళ్ళడం మానలేదు. ఆ ముస్లిములు సహనాన్ని కోల్పోయి పెద్ద దృఢమైన దుడ్డుకర్రతో మహల్సాపతి తలమీద బలంగా కొట్టారు. మహల్సాపతి తలమీద దెబ్బపడడం తోనే, మసీదులో ధుని ప్రక్కనున్న సాయిబాబా ఆకాశము దద్దరిల్లేట్లు పెద్ద కేక వేసారు. హిందూ ముస్లిము భక్తులిరువురూ పరుగు పరుగున మసీదు లోపలికి వెళ్లారు. వెళ్లి చూతురు గదా, మహల్సాపతిపై పడిన దెబ్బలన్నీ బాబా వంటిమీద, తలమీదా కనిపించాయ్, బాబా తలనుంచీ ఏకధారగా రక్తం కారుతూంది. అది చూచిన హిందూ ముస్లిముల కళ్ళనుంచీ కడివెడు కడివెలుగా కన్నీళ్ళు కురుస్తున్నాయ్. వాళ్ళ దుఃఖాశ్రువులకు చలించిపోయిన బాబా – నాయనలారా! వచ్చినవాడు హిందువా, ఇస్లామియా, క్రైస్తవుడా, యూదా' అను బేధాలు నాకు లేవు. ఎవరయితే ప్రేమతో, భక్తితో, ఆర్తితో నన్ను స్మరిస్తారో వారి సమస్త కష్టాలనూ నేనే భరిస్తాను. వారిని రక్షించడం నా కర్తవ్యం. రాముడు, రహీమూ ఒక్కడేనని తెలుసుకోండి. హిందూ ముస్లిములందరూ ఒకే సూర్యుడి వెలుగులో ఒకే చంద్రుని వెన్నెలలో జీవిస్తున్నారని మరిచి పోకండి.

